1 St Year
Happy Work Anniversary.


షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 63 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 06 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 63 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Friday 06 February 2026 PAGES : 8 PRICE : 3/-

# సంతానోత్పత్తి రేటు 2.1% ఉంటే సుస్థిర ప్రగతి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 05)

ఇప్పటి వరకు కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యం ఇచ్చామని, ఇప్పుడు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి చర్చిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. దీనిపై డ్రాఫ్ట్ పాలసీ రూపొందిస్తున్నామని, నెల రోజుల పాటు చర్చ తర్వాత తుదిరూపు ఇస్తామని చెప్పారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై శాసనసభలో సీఎం ప్రకటన చేశారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏడాదికి 6.70 లక్షల మంది పిల్లలు పుడుతున్నారని అన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో వృద్ధాప్యం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు (ఖీ=) 1.5 శాతంగా ఉందని చెప్పారు. ఇది 2.1 శాతంగా ఉంటే సుస్థిర ప్రగతి ఉంటుందని చెప్పారు. దేశంలో కంటే రాష్ట్రంలో వృద్ధాప్యం ఎక్కువగా ఉందన్నారు.“ 1997లో ఏపీ పాపులేషన్ పాలసీ తీసుకొచ్చాం. మన వద్ద 1992లో టీఎఫ్ఆర్ 3 ఉండగా ఇప్పుడు 1.5కు వచ్చింది. ప్రస్తుతం తమిళనాడులో 1.4శాతం, కేరళలో 1.6శాతం, బిహార్‌లో 3 శాతం టీఎఫ్ఆర్ ఉంది. 57 శాతం మంది ఒక్కరితో ఆపివేస్తున్నారు. 32 శాతం మంది ఇద్దరిని కంటున్నారు.

9శాతం మాత్రమే ఇద్దరి కంటే ఎక్కువ మందిని కంటున్నారు. 60 ఏళ్లు దాటినవారు 10 శాతం మంది ఉన్నారు. 2047 నాటికి ఇది 23 శాతానికి చేరుతుంది.ఏప్రిల్ 1 నుంచి కొత్త పాలసీ అమలు చేస్తాం. పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఏపీ నిలుస్తుంది. 1.5గా ఉన్న టీఎఫ్ఆర్‌ను 2.1కు తీసుకెళ్లడం మన లక్ష్యం. ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లల్ని కంటే కాన్పు సమయంలో రూ.25వేలు ఇస్తాం. నగదు పురస్కారం గేమ్ ఛేంజర్ కానుందని భావిస్తున్నాం. ఫ్యామిలీ ప్లానింగ్ ఇప్పుడు అసంబద్ధం. నా మాటల్ని గతంలో వ్యతిరేకించిన జేపీ వంటి వారు ఇప్పుడు సమర్థించారు. ఆర్ఎస్ఎస్ మోహన్ భగవత్ కూడా పాపులేషన్ పెంచాలని అంటున్నారు. యూపీ, బిహార్‌లో మాత్రమే దేశంలో అత్యధిక జనాభా ఉంది. దక్షిణ భారత దేశంలో జనాభా తక్కువగా ఉంది. జనాభా తగ్గడం వల్ల రాజకీయంగానూ ఇబ్బందులు వస్తాయి. కానీ, నేను రాజకీయ ప్రయోజనాల గురించి మాట్లాడటం లేదు. ▶మిగతా 2లో

## అసెంబ్లీకి గైర్హాజరవడం సబబు కాదు

### అయ్యన్న పాత్రుడు



(షణ్ముఖ వెలుగు, అమరావతి, మార్చి 05)

ప్రజా సమస్యల పరిష్కార వేదికైన అసెంబ్లీకి గైర్హాజరవడం సబబు కాదని శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మీడియాతో అయ్యన్నపాత్రుడు చిట్‌చాట్‌గా మాట్లాడారు. అసెంబ్లీలో ప్రతిపక్షం, పాలకపక్షం ఉంటేనే బాగుంటుందన్నారు. ▶మిగతా 2లో

## రోడ్ల విస్తరణలో తొలగించే చెట్లను తిరిగి నాటేలా పాలసీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 05)

రోడ్ల విస్తరణకు అడ్డంగా ఉన్నాయని వందేళ్లకు పైబడిన చెట్లను కొట్టేయడం ఆవేదన కలిగిస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసెంబ్లీలో చర్చ సందర్భంగా ప్రస్తావించారు. వృక్షాలను కొట్టేయకుండా మరో చోట వాటిని మళ్లీ నాటితే చిగురిస్తాయని తెలిపారు.

దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. రోడ్ల విస్తరణలో తొలగించే చెట్లను తిరిగి నాటేలా పాలసీ రూపొందిస్తామన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణపైనా దృష్టి పెడతామన్నారు.


## 2024-25లో జాతీయ పార్టీల ఆదాయంలో బీజేపీ టాప్

- ▶అన్ని పార్టీలకు రూ.7,960.09 కోట్ల ఆదాయం
- ▶సమకూరగా, 85 శాతం బీజేపీ ఖాతాలోకి!
- ▶రూ.918 కోట్ల ఆదాయంతో రెండో స్థానంలో కాంగ్రెస్
- ▶ఆదాయం కంటే అధికంగా ఖర్చు చేసిన కాంగ్రెస్, బీఎస్పీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 05)

2024-25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ పార్టీలలో బీజేపీ అత్యధిక ఆదాయాన్ని నివేదించినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. దేశంలోని ఆరు జాతీయ పార్టీలకు ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.7,960.09 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపింది. ఇందులో 85.03 శాతం వాటా బీజేపీ ఖాతాలోకి వెళ్లినట్లు పేర్కొంది. ఎన్నికల సంఘానికి ఆయా పార్టీలు సమర్పించిన ఆడిట్ నివేదికల ఆధారంగా ఏడీఆర్ ఈ లెక్కలను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి రూ.6769.14 కోట్ల ఆదాయం సమకూరింది. 918.28 కోట్ల ఆదాయంతో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉండగా, ఆ తర్వాత ▶మిగతా 2లో



## దేవదేవుడితో బొత్స ఆటలు

### తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ధ్వజం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 05)

మండలిలో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని సమర్థించిన వైకాపా నేత బొత్స సత్యనారాయణ దేవదేవుడితో ఆటలాడుతున్నారని.. అది మంచిది కాదని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. సంగం డెయిరీకి వైష్ణవి డెయిరీతో, హెరిటేజ్ సంస్థకు ఇందాపూర్‌తో ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. ఈ సంస్థలు ఒకటైతే గత వైకాపా ప్రభుత్వంలో నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొనాలని తితిదే ఎందుకు మెయిల్స్ పంపిందని నిలదీశారు. 200 మందికి పైగా పోలీసు బందోబస్తుతో 30 రోజులు సంగం డెయిరీ కార్యాలయంలో సోదా చేసినప్పుడు వైష్ణవి డెయిరీ అంశం ఎందుకు గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ▶మిగతా 2లో

## ఇరాన్‌పై దాడుల వేళ.. శక్తిమంతమైన అణు క్షిపణిని పరీక్షించిన అమెరికా

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 05)

పశ్చిమాసియాలో యుద్ధం వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణిని అమెరికా పరీక్షించింది. మంగళవారం (మార్చి 3) ఈ పరీక్ష జరగ్గా.. అందుకు సంబంధించిన వివరాలు తాజాగా బయటికొచ్చాయి.కాలిఫోర్నియా తీరంలోని వాండెన్‌బర్గ్ స్పేస్‌ఫోర్స్ బేస్ నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు మినిట్‌మ్యాన్-3 ను అమెరికా ఎయిర్‌ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ పరీక్షించింది. ఆయుధాల్లేని ఈ ఖండాంతర క్షిపణి నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించినట్లు యూఎస్ స్పేస్‌ఫోర్స్ వెల్లడించింది. ఈ పరీక్ష విజయవంతమైందని, అత్యంత కచ్చితత్వంతో క్షిపణి లక్ష్యాన్ని చేరుకుందని తెలిపింది. క్షిపణిలోని ఒక్కో విభాగం పనితీరును స్పష్టంగా తెలుసుకునేందుకు ఈ పరీక్ష చేపట్టినట్లు యూఎస్ స్పేస్‌ఫోర్స్ పేర్కొంది. అయితే, ఇరాన్‌పై దాడుల వేళ.. ఈ పరీక్ష నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.



మినిట్‌మ్యాన్-3లో అత్యంత శక్తిమంతమైన మార్క్-21 రీఎంట్రీ వెహికల్ ఉంటుంది. దీనిలో న్యూక్లియర్ పేలోడ్‌ను అమర్చవచ్చు. జపాన్‌లోని హిరోషిమాపై ▶మిగతా 2లో

## సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం: ప్రధాని మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 05)

సైనిక ఘర్షణల ద్వారా ఏ సమస్యనూ పరిష్కరించలేమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో యుద్ధాలకు త్వరగా ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. భారత్ పర్యటనలో ఉన్న ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో చర్చలు నిర్వహించిన అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. ఇటీవల ఈయూతో కుదుర్చుకున్న ‘స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం’.. భారత్, ఫిన్లాండ్‌ల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు.“భారత్, ఫిన్లాండ్‌లకు చట్టబద్ధ పాలన, చర్చలు, దౌత్యమార్గాలపై విశ్వాసం ఉంది. కేవలం సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం. అది ఉక్రెయిన్, లేదా పశ్చిమాసియా.. ఏదైనా కావచ్చు. వివాదాలను వీలైనంత త్వరగా ముగించేందుకు, శాంతిని నెలకొల్పేందుకు చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇస్తూనే ఉంటాం” అని మోదీ తెలిపారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ప్రధాని ▶మిగతా 2లో





## విధ్వంసం చేసి మాపై ఆరోపణలా?

దూరదృష్టి లేని ప్రయోగాలతో విద్యార్థులను రోడ్డున పడేశారు

టోఫెల్‌పై రూ.58.84 కోట్లు పెట్టి ఒక్క పరీక్షైనా నిర్వహించారా?

మాజీ సీఎం జగన్‌పై విద్యాశాఖ మంత్రి లోకేశ్ ధ్వజం

విద్యాశాఖ పద్దుపై చర్చలో ఘాటు విమర్శలు

2

## ఇరాన్‌పై విచ్చుకున్న ఉక్కు రెక్కలు.. రంగంలోకి స్ట్రాటోఫోర్ట్రెస్..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 05)

అదొక భారీ ఉక్కు డేగ.. ఒక్కసారి గాల్లోకి ఎగిరితే శత్రువుపై 38 టన్నుల బాంబుల వర్షం కురిపించడం ఖాయం. గగనతలం నుంచే సముద్రంలోని లక్షల చదరపు మైళ్లను నియంత్రణలోకి తెచ్చుకుంటుంది. ఒక్క యుద్ధంలో 40% బాంబులను ప్రయోగించిన చరిత్ర దీనిది. ఒకరకంగా చెప్పాలంటే యుద్ధ విమానాల్లో అనకొండ లాంటిది. అదే అమెరికాకు చెందిన బి-52 స్ట్రాటో ఫోర్ట్రెస్ బాంబర్..! అమెరికా వాయుసేనకు ఇది వెన్నెముక లాంటిది. బి-2 స్పిరిట్‌లా దీనికి పెద్దగా ప్రచారం లేకపోయినా.. ఇది సైలెంట్‌గా తన పని తాను చేసుకుపోతుంది.అమెరికా వాయుసేన ▶మిగతా 2లో

# సంతానోత్పత్తి రేటు 2.1% ఉంటే సుస్థిర ప్రగతి

ఒకరు వద్దు.. ఇద్దరు ఓకే.. ముగ్గురు ముద్దు

ఇక నుంచి ఒకరు వద్దు.. ఇద్దరు ఓకే.. ముగ్గురు ముద్దు అని మాట్లాడాలి. శాసనసభలో చర్చ జరిగితే విభిన్న అభిప్రాయాలు వచ్చాయి. లేదంటే ఆ అభిప్రాయాలు ఎలా తెలుస్తాయి? ఇప్పటికీ పేద వర్గాల వారే ఎక్కువ మంది పిల్లల్ని కంటున్నారు. అందుకే తల్లికి వందనం పథకం అందరికీ ఇచ్చాం. డబ్బులు ఉన్నవారు ఎందుకు తక్కువ మంది పిల్లల్ని కంటున్నారు. అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు ఉండేలా చూస్తాం. ఒక జంటకు కనీసం ఇద్దరు పిల్లలుండాలి. ముగ్గురు పిల్లల్ని కంటే ఇంకా మంచిది. రెండో బిడ్డను కన్న తండ్రికి ఒక నెల, మూడో బిడ్డను కన్న తండ్రికి 2 నెలలు సెలవు మంజూరు చేస్తాం" అని చంద్రబాబు అన్నారు.

## అసెంబ్లీకి గైర్హాజరవడం సబబు కాదు

" వైకాపా సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే సమయం కావాలి. అనర్హత వేటు అంశం ఏపీలో విజయవంతమైతే దేశమంతా అలాగే జరుగుతుంది. గవర్నర్ ప్రసంగం రోజు వస్తే హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడిది? ఆ రోజు వచ్చినా హాజరుగా పరిగణించరు. నిబంధనలను కాదని, అడ్డగోలుగా వాదించేవారిని ఏమనాలి? మాజీ సీఎంగా దక్కాల్సిన అన్ని మర్యాదలు జగన్‌కు లభిస్తున్నాయి. అప్పట్లో అధికార- ప్రతిపక్ష సభ్యులు పోరాడినా బయట స్నేహంగా ఉండేవారు. ఇప్పుడు ఆ సంస్కృతి పోయి విరోధుల్లా తయారవుతున్నారు. శాసనమండలి అంటే పెద్దల సభగా, పెద్ద ఆలోచనలు ఉన్న వారితో ఉండేది. పెద్ద ఆలోచనలు లేనివారు ఆ సభలో ఉంటే ఎలా ఉంటుందో ఇప్పుడు చూస్తున్నాం" అని అయ్యన్న పాత్రుడు అన్నారు.

## 2024-25లో జాతీయ పార్టీల ఆదాయంలో బీజేపీ టాప్

172.60 కోట్లు సీపీఎంకు, రూ.58.58 కోట్లు బీఎస్పీకి, రూ.39.28 కోట్లు ఆమ్ ఆద్మీ పార్టీకి, రూ.2.18 కోట్లు నేషనల్ పీపుల్స్ పార్టీకి సమకూరాయి. బీజేపీ తన ఆదాయంలో 55.76 శాతం అంటే రూ.3,774.58 కోట్లు, కాంగ్రెస్ రూ.1111.94 కోట్లు ఖర్చు చేసింది. కాంగ్రెస్ పార్టీ చేసిన ఖర్చు మొత్తం ఆదాయం కంటే 21.09 శాతం ఎక్కువ. బీఎస్పీ కూడా తనకు సమకూరిన ఆదాయం కంటే 81 శాతం అదనంగా ఖర్చు చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ మాత్రం ఆదాయంలో 92.83 శాతం ఖర్చు చేసింది. 2023-24, 2024-25 మధ్య కాలంలో బీజేపీ ఆదాయం 55.95 శాతం పెరగగా, కాంగ్రెస్ ఆదాయం 25.05 శాతం తగ్గింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఆదాయం 73.20 శాతం పెరిగింది. ఆరు జాతీయ పార్టీలకు వచ్చిన ఆదాయంలో 85.08 శాతం విరాళాల రూపంలోనే వచ్చింది. బీఎస్పీకి మాత్రం తన ఆదాయంలో 100 శాతం ఇతర మార్గాల్లో వచ్చింది.

## ఇరాన్‌పై దాడుల వేళ.. శక్తిమంతమైన అణు క్షిపణిని పరీక్షించిన అమెరికా

జారవిడిచిన అణుబాంబు కంటే 20 రెట్లు శక్తిమంతమైన అణు వార్‌హెడ్‌లను ఇది మోసుకెళ్లగలదు. గతంలో పలుమార్లు దీని శక్తి సామర్థ్యాలను అమెరికా పరీక్షించింది. ఈ క్షిపణి గంటకు 15వేల మైళ్ల వేగంతో 6వేల మైళ్ల దూరం వరకు ప్రయాణించగలదు. దీన్ని ప్రయోగించిన కొన్ని నిమిషాల్లోనే లక్ష్యాన్ని ఛేదించగలదు.

## సైనిక ఘర్షణల ద్వారా సమస్యలను పరిష్కరించలేం: ప్రధాని మోదీ

వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఇరాన్‌పై దాడి కోసం భారత పోర్టులను అమెరికా వాడుతోందా?

ఫిన్లాండ్ అధ్యక్షుడితో చర్చల్లో భాగంగా ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. "ఏఐ నుంచి 6జీ వరకు, క్లీన్ ఎనర్జీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు అనేక హైటెక్ రంగాల్లో పరస్పర

**మొదటిపేజీ తరువాయి**

సహకారానికి కట్టుబడి ఉన్నాం" అని చెప్పారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం భారత్‌కు వచ్చారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పర్యటన చేపట్టారు.

## విధ్వంసం చేసి మాపై ఆరోపణలా?

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 05)

'మాజీ సీఎం జగన్ ఎప్పుడు ప్రెస్‌మీట్ పెట్టినా సీబీఎస్ఈ, టోఫెల్, ఐబీ అంటారు. ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ లేకుండా ఫలితాలు ఎలా సాధ్యం? ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాక్ పరీక్ష పెడితే చాలామంది విద్యార్థులు ఫెయిలయ్యారు. టోఫెల్‌పై రూ.58.84 కోట్లు ఖర్చుపెట్టి ఒక్క పరీక్ష పెట్టలేదు. విధ్వంసం చేసి.. ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. టీం-11 ఇక్కడ ఉంటే వారిని సూటిగా ప్రశ్నించేవాడ్ని'

శాసనసభలో విద్యాశాఖ మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం విద్యాశాఖనూ విధ్వంసం చేసిందని మంత్రి లోకేశ్ మండిపడ్డారు. దూరదృష్టి లేకుండా ప్రయోగాలు చేసి విద్యార్థులను పాఠశాలలకు దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో బంధువులను వీసీలుగా నియమించి వర్సిటీలను భ్రష్టుపట్టించారని విమర్శించారు. గాడితప్పిన విద్యారంగాన్ని మళ్లీ దారిలో పెట్టేందుకు గత 20 నెలల్లో ప్రజాప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచేలా విద్యారంగాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. మండలానికి రెండు పాఠశాలల్లో హాజరు శాతం రెట్టింపయ్యేలా ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రాజధాని అమరావతిలో ప్రపంచస్థాయి సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి డిజైన్ సిద్ధమయ్యాయని, శోభా రియాలిటీ సంస్థ రూ.100 కోట్ల విరాళం ప్రకటించిందని అన్నారు. శాసనసభలో విద్యాశాఖ పద్దుపై చర్చ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడారు.

బంధుగణంతో నింపేశారు: 'ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బంధువులతో నింపేశారు. ఆంధ్రావర్సిటీ వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి.. జగన్ విశాఖకు వెళ్లినప్పుడల్లా విద్యార్థులను రోడ్లపై నిలబెట్టి చప్పట్లు కొట్టించారు. అర్హత లేకపోయినా మాజీ సీఎం బంధువు సుందరవల్లిని ఎస్వీయూ రెక్టార్‌గా నియమించారు. ఆమెనే మళ్లీ విక్రమ సింహపురి వర్సిటీ వీసీ సీట్లో కూర్చోబెట్టారు. పదేళ్లు ప్రొఫెసర్‌గా ఉండాలన్న నిబంధనను గాలికి వదిలేసి శ్రీకాంత్‌రెడ్డిని ఎస్వీయూ వీసీగా నియమించారు. మాజీ సీఎం బావమరిది సురేంద్రనాథ్‌రెడ్డిని ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్... వర్సిటీలో వైఎస్ విగ్రహం పెట్టారు. మాజీ సీఎం పుట్టినరోజుకు వర్సిటీలో ఫ్లెక్సీలు పెట్టారు. ఇవి వీసీలు చేయాల్సిన పనులేనా?' అని మంత్రి లోకేశ్ నిలదీశారు.

రూ.4వేల కోట్లు బకాయిలు: 'వైకాపా హయాంలో బోధన సిబ్బంది నియామకాలు జరగలేదు. రూ.4వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిపోయారు. 90 రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ ప్రక్రియ పూర్తిచేస్తాం. పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీలను జోడించి కొత్త కరిక్యులమ్ రూపొందించాం' అని లోకేశ్ వివరించారు. '2019-24 మధ్య సుమారు పది లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. డ్రాప్‌బాక్స్‌ని దుర్వినియోగం చేశారు. 3లక్షల మంది పిల్లలను డ్రాప్‌బాక్స్‌లో పెట్టి వారికి కావలసిన సౌకర్యాలన్నీ అడ్డగోలుగా డ్రా చేశారు. జీవో 117 కారణంగా సింగిల్ టీచర్ పాఠశాలలు 12,512కి పెరిగాయి. దీనివల్ల విద్యార్థుల సామర్థ్యాలు దెబ్బతిన్నాయి' అని లోకేశ్ పేర్కొన్నారు.

## ఇరాన్‌పై విచ్చుకున్న ఉక్కు రెక్కలు.. రంగంలోకి స్ట్రాటోఫోర్ట్రెస్..

అమ్ములపొదిలో చాలా పాత బాంబర్ విమానాల్లో బి-52 స్ట్రాటోఫోర్ట్రెస్ ముఖ్యమైంది. ఇది 1955లో ఆ దేశ వాయుసేన చేతికి వచ్చింది. మొత్తం 744 విమానాలను తయారుచేయగా.. చివరి బి-52హెచ్ వేరియంట్‌ను 1962లో తయారుచేశారంటే అవెంత పాతవో అర్థం చేసుకోవచ్చు. ఇది ఒక్కటే 20 క్రూజ్ క్షిపణులను ప్రయోగించగలదు. దీనిని అవసరాలకు అనుగుణంగా అమెరికా యుద్ధాల్లో వాడుకొంటోంది. కోల్డ్‌వార్ వేళ అణ్వాయుధాలను ప్రయోగించగల బాంబర్‌గా ఇది భయపెట్టగా.. వియత్నాం యుద్ధంలో చిన్నస్థాయి బాంబర్‌లాగా సేవలు అందించింది. తాజాగా ఇరాన్‌పై దాడులకు వీటిని రంగంలోకి దించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది.

దాదాపు వందేళ్లు సేవలు..

ఈ స్ట్రాటోఫోర్ట్రెస్‌ల ఎయిర్ ఫ్రేమ్‌లు 100 ఏళ్లు సేవలు అందించగలవని అమెరికా వాయుసేన అంచనా. వీటికి కొత్త ఇంజిన్లను బిగించుకొంటూ 2050 వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాడుకోవచ్చని ఇంపీరియల్ వార్‌మ్యూజియమ్స్ కథనంలో పేర్కొంది.

మందగమనం అయినా.. మహా ప్రమాదకరం..!

స్ట్రాటోఫోర్ట్రెస్‌లు చూడటానికి ఆకారంలో చాలా భారీగా ఉంటాయి. యుద్ధ రంగంలో వ్యూహాత్మక దాడులు, క్లోజ్ ఎయిర్ సపోర్ట్, కౌంటర్ ఎయిర్, మారిటైమ్ ఆపరేషన్లకు వీటిని వాడతారు. 1990ల్లో ఇరాక్‌పై చేపట్టిన ఆపరేషన్‌లో 40% బాంబులను ఈ విమానాలే ప్రయోగించాయంటే.. అమెరికా వీటిపై ఏ స్థాయిలో ఆధారపడుతోందో అర్థం చేసుకోవచ్చు. అణు, లేజర్ గైడెడ్, క్లస్టర్, బంకర్‌బస్టర్లు, గ్రావిటీ బాంబులు, జీపీఎస్ గైడెడ్ ఆయుధాలను కూడా ప్రయోగించే సౌలభ్యం ఉంది. ఒక్కో స్ట్రాటోఫోర్ట్రెస్ విమానం 30 జీబీయూ-31 శ్రేణి బంకర్ బస్టర్లను మోసుకెళ్లగలదు. అదే ఎఫ్-15 ఫైటర్‌జెట్ కేవలం రెండు మాత్రమే తీసుకెళ్లగలదు. ఒక్కసారి గాల్లోకి ఎగిరితే రీఫ్యూయలింగ్ లేకుండా 14,080 కిలోమీటర్లు ప్రయాణించగలదు.

రెండు విమానాలు చాలు..

ఈ విమానాలు సముద్ర నిఘా కార్యకలాపాలను కూడా సమర్థంగా నిర్వహించగలవు. కడలిపై కేవలం రెండు బి-52లు గాల్లో ఉంటే 3,64,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఏం జరుగుతోందో పసిగట్టగలవు. వీటిపై రెండు ఎలక్ట్రో ఆప్టికల్ వ్యూయింగ్ సెన్సర్లు, ఫార్వర్డ్ లుకింగ్ ఇన్ఫ్రారెడ్, అడ్వాన్స్‌డ్ టార్గెటింగ్, బ్యాటిల్ అసెస్‌మెంట్ వంటి వ్యవస్థలు ఉన్నాయి. దీనిలోని పైలట్లు నైట్‌విజన్ గాగుల్స్ వినియోగిస్తారు. ఈ విమానాలు వాడాలంటే సుదీర్ఘమైన రన్‌వే ఉండాలి. అందుకే యూకేలోని ఫెయిర్‌ఫోర్డ్ స్థావరాన్ని అమెరికా తాజాగా ఇరాన్‌పై దాడులు చేసేందుకు వినియోగిస్తోంది. ఇక్కడ 3.2 కిలోమీటర్ల రన్‌వే ఉంది. ఇక ఇరాన్‌కు అత్యంత సమీపంలోని డిగో గార్సియా స్థావరం కూడా ఈ విమానాల వాడకానికి అనుకూలం.

బాగ్దాద్‌ను కుప్పకూల్చింది ఇదే..!

ఇరాక్‌పై అమెరికా చేపట్టిన ఆపరేషన్ డెసర్ట్ స్టార్మ్‌లో భాగంగా 1996 సెప్టెంబర్ 2,3 తేదీల్లో రెండు బి-52హెచ్‌లు బాగ్దాద్‌పై 13 క్రూజ్ క్షిపణులను ప్రయోగించి అక్కడి కమ్యూనికేషన్, విద్యుత్తు కేంద్రాలను ధ్వంసం చేశాయి. ఆ సమయంలో ఈ విమానం లూసియానాలోని బార్క్స్‌డేల్ స్థావరం నుంచి 34 గంటల పాటు ప్రయాణించి ఈ దాడులు చేశాయి.

ఇరాన్ యుద్ధనౌకపై దాడి

2001లో అఫ్గానిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ ఎండ్యూరింగ్ ఫ్రీడమ్‌లో బి-52లు తాలిబన్ దళాలను వణికించాయి. ఆ తర్వాత ఆపరేషన్ ఇరాకీ ఫ్రీడమ్‌లోను పాల్గొన్నాయి.

సిరియా, ఇరాక్‌లో ఐసిస్ ఉగ్రవాదులను అణచివేయడంలో వీటి పాత్ర చాలా కీలకం. 2016లో ఐసిస్‌పై పలుమార్లు దాడులు జరిపాయి. ఇక ఇరాన్‌పై దాడుల్లో కూడా కీలక పాత్ర వీటిదే. అమెరికా మూడ్రోజుల్లో 2,000 టార్గెట్లపై బాంబింగ్ చేయగలిగిందంటే స్ట్రాటోఫోర్ట్రెస్‌లే అందుకు కారణం.

అణు ప్రమాదాలు కూడా..

ఈ భారీ విమానాలు అణ్వాయుధాలతో ప్రయాణిస్తున్న వేళ ప్రమాదాలకు గురైన సందర్భాలు చరిత్రలో ఉన్నాయి. 1966లో స్పెయిన్‌లో బి-52 ఒక కేసీ-135 ట్యాంకర్ విమానాన్ని ఢీకొంది. ఆ సమయంలో బి-52లో ఉన్న నాలుగు థర్మోన్యూక్లియర్ బాంబులు మధ్యధరా సముద్రంలో పడ్డాయి. అయితే అదృష్టవశాత్తూ అవేవీ పేలలేదు. ఆ తర్వాత వాటిని అమెరికా స్వాధీనం చేసుకొంది. 1968లో గ్రీన్ ల్యాండ్‌లోనూ ఓసారి కూలింది. ఇక 1961లో నార్త్ కరోలినా వద్ద మార్క్ 39 శ్రేణికి చెందిన రెండు అణుబాంబులతో వెళుతున్న ఈ విమానం ప్రమాదానికి గురైంది. నాడు కూడా దానిలోని అణ్వాయుధాలు దెబ్బతిన్నాయి.

## దేవదేవుడితో బొత్స ఆటలు

ఆయన విలేకరులతో మాట్లాడారు. "జగన్ జమానాలో కల్తీ నెయ్యి కుంభకోణం నడిపిన నాయకులు ఇప్పుడు మండలిలో సంఖ్యాబలం ఉందని సంబంధం లేని అంశాల్ని చర్చకు తీసుకొస్తున్నారు. తితిదేలో అంతర్గతంగా ఉండాల్సిన సంగం టెండర్ కాపీ బయటకు ఎలా వచ్చింది? భూమన కరుణాకరరెడ్డి గతంలో చెప్పినట్టు తితిదేలో వైకాపా కోసం పనిచేస్తున్న ఉద్యోగులే వాటిని లీక్ చేశారు. కొందరు ప్రభుత్వంలో ఉంటూ వైకాపాకు అనుకూలంగా పనిచేస్తున్నారు. వారి మీద చర్యలు తీసుకోవాలి" అని ధూళిపాళ్ల నరేంద్ర మండిపడ్డారు. "పేదల బియ్యం బొక్కిన కేసు నుంచి తనను, తన సతీమణిని కాపాడమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాళ్ల మీద పడి పేర్ని నాని బయటపడ్డారు. అలాంటి ఆయన సంగం మీద అనవసర విమర్శలు చేస్తున్నారు" అని నరేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## టీనేజ్ మ్యారేజ్, ప్రెగ్నెన్సీ పై అవగాహన కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, చినగంజాం, మార్చి 05)

19 సంవత్సరాల లోపు బాలికలు వివాహము జరిపిన యెడల తల్లిదండ్రుల మేద చట్టరీత్యా చర్య తీసుకునబడునని డాక్టర్ పి సాయి శ్రీ చరణ్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నగంజాం పంచాయతీ సోపిరాల అంగన్వాడీ సెంటర్ నందు జరిగిన కార్యక్రమంలో చిన్నగంజాం ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పి సాయి శ్రీ చరణ్ టీనేజ్ మ్యారేజ్, ప్రెగ్నెన్సీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీనేజ్ ప్రెగ్నెన్సీ వలన శారీరక ఇబ్బందులు వచ్చునని తెలిపారు. ప్రెగ్నెంట్ రాకుండా ఫేసింగ్ మెథడ్స్ వాడవలెనని అన్నారు. గర్భానికి గర్భానికి మూడు సంవత్సరాలు గ్యాప్ ఉండవలనని దానికి ఆంధ్ర ఇంజక్షన్, ఓరల్ పిల్స్, ఐయుడి, నిరోద్‌లు వాడలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఝాన్సీ రాణి, హెచ్‌వి ఉల్తారాణి, పీహెచ్ఎన్ స్వర్ణలత, హెల్త్ సూపర్వైజర్ చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ మురళి, ఏఎన్ఎం స్టాలిన్ దేవి, సిహెచ్ ఓ రమాదేవి, ఆశాలు, పాల్గొన్నారు.


## అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం

### జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 05)



జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, మండల న్యాయ సేవాధికారి కమిటీలు అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, ప్రాథమిక స్థాయిలోనే వ్యాజ్యాల పరిష్కారం, చట్టాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. గురువారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పానల్ న్యాయవాదులతో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ అర్హులైన కక్షిదారులకు ఉచితంగా న్యాయ సహాయం అందించాలనే ఉద్దేశంతో పనిచేసే న్యాయవాదులు యొక్క కృషి ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చిన న్యాయవాదులను అభినందించారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారు రూపొందించిన ఈ జాబితాలో భాగమైనందుకు ప్రతి ఒక్క న్యాయవాది తమ యొక్క అమూల్యమైన పాత్రను పోషించి ఉచిత న్యాయ సహాయం అందించాలని అన్నారు. సంవత్సర ఆదాయం మూడు లక్షలు లోపు ఉన్నవారికి, స్త్రీలకు, షెడ్యూల్ కులాలు, జాతుల వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి వీర రాఘవులు, న్యాయవాదులు పరుచూరి లక్ష్మీకుమారి, షేక్ అజీజ్, నాయుడు ఈశ్వరరావు, దేగల రాజేంద్రప్రసాద్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.




## కలెక్టర్‌ను కలిసిన ఎరిక్షన్‌బాబు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మార్చి 05)

జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజ బాబుని గురువారం యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాల పై జిల్లా కలెక్టర్‌తో సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా రోడ్లు, వంతెనలు, విద్యా వసతి గృహాలు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.





ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ **వెలుగు**

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

06.03.26 శుక్రవారం


# దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉంది

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 05)**

దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించే సారథులు నేటి విద్యార్థులే, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతిలోనే ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు గురువారం చీరాలలో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై 25 ఏళ్ల రజతోత్సవం సందర్భంగా రూపొందించిన సావనీరును విడుదల చేశారు. కళాశాలలో అధ్యాపకులు, ఉన్నత స్థాయికి ఎదిగిన విద్యార్థులకు అవార్డులు, జ్ఞాపికలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యా సంస్థ ఫౌండర్, చైర్మన్, మాజీ మంత్రి వనమ వెంకటేశ్వరరావును విద్యా సంస్థ డైరెక్టర్లతో కలసి కలెక్టర్ సన్మానించారు. సమాజానికి మనం ఏం చేస్తున్నామనే ఆలోచనలతో, దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించే మంచి సైనికుల్లా నేటి విద్యార్థులు గొప్ప వ్యక్తులు కావాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ప్రపంచంలో నెంబర్ స్థానం నాది అనే బలమైన కోరిక విద్యార్థుల్లో ఉండాలన్నారు. అదే లక్ష్యంతో భవిష్యత్తు వైపు అడుగులు వేయాలన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో చదివినప్పుడే మన ఎదుగుదల బాగుంటుందన్నారు. భవిష్యత్తు యంత్రాన్ని మన చేతిలో ఉంచుకుని ముందుకు నడవాలన్నారు. మీరు తీసుకునే నిర్ణయాలపైనే మీ భవిష్యత్తు, అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. తద్వారా మీ జీవితం సంతృప్తిగా ఉండాలన్నారు. విద్యార్థులు మూడు అంశాలను ఒకే లక్ష్యంగా చేసుకోవాలన్నారు. బాగా చదవాలి, ఆ చదువుతో ఆర్థిక స్తోమత సాధించాలి, తద్వారా తన కుటుంబాన్ని బాగా చూసుకోవాలి. తదుపరి తాను ఉండే ప్రాంతం సుభిక్షంగా ఉండేలా చూడాలి. అనంతరం సమాజం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సెయింట్ ఆన్స్ విద్యాసంస్థ స్థాపించి 25 ఏళ్లపాటు ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యా బోధనతో సుదీర్ఘ సేవలను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల కలిసి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పేదవాడు అన్నం తినడానికి బియ్యం, ఉండడానికి ఇల్లు, ఇలా ఏదైనా సహాయం చేసే పరిపాలకుల కొరత ఉంది. అధికారం ఉంటేనే సాధ్యమని గుర్తించి ఐఏఎస్ అధికారిని అయ్యానని కలెక్టర్ వినోద్ కుమార్ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. గొప్ప ఇంజినీర్ కావాలని కలలు కనే వాడ్ని... బయాలజీలో 99 మార్కులు సాధించి, కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడంతో మెడిసిన్ వైపు దృష్టి మార్చుకున్నాను. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్లి పెద్ద డాక్టర్ కావాలని కోరుకున్నాను. దేశం విడిచి పోవద్దని నా తండ్రి చెప్పారు. అందుకే ఎంబిబిఎస్ డాక్టర్ గా ప్రథమ శ్రేణిలో నిలిచి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఇంటర్న్ షిప్ చేస్తూ 94 సర్జరీలతో కాన్పులు జయప్రదంగా చేశాను. కర్ణాటక రాష్ట్రం సరిహద్దుల్లోని ఒక గ్రామంలోని పిహెచ్ సిలో సర్కారీ ఉద్యోగం వచ్చింది. నెల రోజులుపైగా విధులు నిర్వహించినా ఆ వైద్యశాలలో సర్జరీకి అవసరమైన పరికరాలు లేక ఒక్క ఆపరేషన్ చేయలేకపోవడం, రోగులను పట్టణానికి వెళ్ళమని పంపడం బాధ కలిగించింది. అప్పుడే ఐఏఎస్ అధికారి కావాలని నిర్ణయించుకున్నానని వివరించారు. కోరికలు అనేకం ఉన్నప్పటికీ తన నిర్ణయాలన్ని, తన మనసుకు నచ్చినట్లు తీసుకున్నాను. అందుకే తన ఉద్యోగంలో (తరువాయి 4లో...)



# కేపీఐ, పీ 4 లపై మరింత దృష్టి పెట్టాలి


## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 05)**

కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ), జీరో పావర్టీ (పీ-4) లపై మరింత దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గ విజనరీ ప్లానింగ్ సభ్యులతో గురువారం కలెక్టరేట్లో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల వ్యక్తిగత పనితీరుకు వివిధ అంశాలలో సాధించిన పురోగతిని తెలిపే కేపీఐ ప్రతిబింబాలుగా ఉంటాయన్నారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు కేపిఐలతో పాటు జీరో పావర్టీ పథకం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ దృష్ట్యా ప్రతి ఉన్నతాధికారి తమకు సంబంధించిన ఇండికేటర్లపై నిరంతరం దృష్టి సారించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ప్రతినెలా పదవ తేదీతో డేటా ఎంట్రీ ఫ్రీజ్ అవుతుంది కాబట్టి సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. ఆయా విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించేలా ఒక శిక్షణా కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో రూపొందించిన విజన్ యాక్షన్ ప్లాన్ ను జిల్లాస్థాయి ప్రణాళికతో సమన్వయం చేస్తూ అమలు చేసేలా అధికారులు పనిచేయాలన్నారు. అదే విధంగా పీ 4 పథకం అమలు పైనా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టినందున (తరువాయి 4లో...)

# రూ.6 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 200 సబ్ స్టేషన్ల నిర్మాణం

- విద్యుత్ సరఫరా ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యం
- కూటమిలో పరిశ్రమల రాకతో పెరుగుతోన్న విద్యుత్ వినియోగం
- అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, పవర్ స్టేషన్ల నిర్మాణం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, మార్చి 05)**

రాష్ట్రంలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.6 వేల కోట్లతో పనులు చేపట్టినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలిత కుమారి, ముత్తుముల అశోక్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 200 కు పైగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల అవసరం ఉందని గుర్తించి, వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. విజయనగరం జిల్లా వేణుగోపాలపురం సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రస్తుతం రీటెండరింగ్ దశలో ఉన్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే విజయనగరం జిల్లాలో రూ.46 కోట్ల వ్యయంతో 220 కేవీ, 132 కేవీ లైన్ల పనులు పూర్తి అయ్యాయని, వాటిని త్వరలో చార్జ్ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా వేణుగోపాలపురంలో రూ.77 కోట్లతో (తరువాయి 4లో...)

# మీడియా చురుకైన పాత్ర పోషించాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

అక్రిడేషన్ కమిటీ సభ్యులు, కలెక్టరేట్ ప్రతినిధులకు అక్రిడేషన్లు పంపిణీ









**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 05)**

ప్రజా సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లేలా మీడియా చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సూచించారు. జిల్లాలో తొలి విడతలో అక్రిడేషన్ కార్డులు పొందిన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు, కలెక్టరేట్ రిపోర్టర్లకు గురువారం ప్రకాశం భవనంలో ఆయన వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో చేపట్టబోతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వారికి వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల పై స్పష్టత ఇచ్చారు. ఆయా విషయాలలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య నిరంతర వారధిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్రిడేషన్ కమిటీ సభ్యులు గొట్టిపాటి నాగేశ్వరరావు, కోనూరి శ్రీనివాసులు, జనార్ధన్, సుధాకర్, మల్లిఖార్జున,ఉబ్బా అశోక్, రాజు, కోటిరెడ్డి, శ్రీను వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# హౌసింగ్ పిడి గా బాధ్యతలు చేపట్టిన మోహన్‌రావు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 05)**

మార్కాపురం జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ (పి.డి)గా ఎమ్.వి మోహన్‌రావు గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా హౌసింగ్ ఈఈ గా పనిచేస్తూ మార్కాపురం జిల్లాకు పిడిగా పదోన్నతి పై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన మోహన్‌రావు అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి రాజబాబును ఒంగోలు కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూల కుండీ అందజేశారు. ఈ సందర్భంగా పి.డి మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాల మేరకు నూతన జిల్లాలో గృహ నిర్మాణ పథకాన్ని సమర్థవంతంగా అమలుచేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉంది





సంతృప్తి ఉంది, ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన కళాశాల రోజులలో విలువైన స్నేహితులను సంపాధించుకున్నాను. నేటికీ తన స్నేహితులే తన జీవితంలో భాగస్వాములుగా ఉండిపోయారని విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. వేలాది మంది జీవితాల్లో విద్యా వెలుగులు నింపి అవకాశం లభించిందని ఆ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జగదీష్ బాబు చెప్పారు. ప్రతి ఏటా ఆరువేల మంది విద్యార్థులను సమాజంలోకి పంపుతున్నామన్నారు. వారంతా విభిన్న రంగాలలో ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ విధానాన్ని 15 సంవత్సరాల క్రితమే మా కళాశాలలోని విద్యార్థులకు పరిచయం చేశామన్నారు. ఎన్నో మైలు రాళ్లను అధిగమించి, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో టి చంద్రశేఖర్, విద్యా సంస్థ చైర్మన్ వి రాఘవేంద్రరావు, వైస్ చైర్మన్ బి ఫణిరాజ్, కార్యదర్శి వి రామకృష్ణ, కరెస్పాండెంట్ లక్ష్మణరావు, డైరెక్టర్లు ఏ మనోహర్, ఏ ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, ఎం వీరభద్రరావు, డాక్టర్ సిఎస్ రావు, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.






## అగ్ని ప్రమాదాల వల్ల కలిగే నష్ట నివారణ పద్ధతులపై అవగాహన







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 05)**

జిజిహెచ్ ఆసుపత్రిలో వివిధ ప్రదేశాల్లో సందర్భాలలో అగ్ని ప్రమాదాల వల్ల కలిగే నష్ట నివారణ పద్ధతుల పై అన్ని స్థాయిల్లో సిబ్బంది అవగాహన పెంచుకోవాలని, ఈ మేరకు జిజిహెచ్ లో ఉన్న ఫైర్ ఫైట్ పరికరాల పని తీరుపై అవగాహన అవసరం అని, జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు అన్నారు. ఒంగోలు జిజిహెచ్‌లో డిసాస్టర్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఫైర్ మాక్ డ్రల్ జరిగింది. ఈ మాక్ డ్రిల్ కు జిజిహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బంది, శానిటేషన్, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అసిస్టెంట్ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. షార్ట్ సర్క్యూట్, గ్యాస్, ఏసి మెషిన్‌లు అగ్ని ప్రమాదానికి గురైతే ఎటువంటి పదార్థాల ద్వారా మంటలకు అదుపు చేసి ఆర్పీ వెయ్యాలో వివరించారు. అగ్ని ప్రమాదాల సమయంలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతం ను బట్టి వాడాల్సిన పదార్థులు ( నీరు, ఫోమ్, సిఓ2, పౌడర్) లను ఎలా వాడాలో వివరించారు. అనంతరం సిబ్బందిచే ప్రాక్టికల్‌గా ఎలా మంటలను అదుపు చెయ్యాలో చేసి చూపించారు. ఆసుపత్రుల్లో నిత్యం అప్రమత్తతో ప్రమాదాల నివారణ, నష్ట తీవ్రతను తగ్గించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటర్ అద్దయ్య మాట్లాడుతూ దశల వారి శిక్షణ సిబ్బందికి ఫైర్ డిపార్ట్మెంట్ ద్వారా ఇప్పిస్తామని, అదే విధంగా ఫైర్ పరికరాల నిర్వహణ నిరంతరం చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరెంటెండెంట్‌లు డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రభాకరరావు, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌రెడ్డి, నర్సింగ్ సూపరెంటెండెంట్ ఎం జయలలిత, సెక్యూరిటీ, శానిటేషన్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ఫిర్యాదుల పై తక్షణ స్పందన
## పనుల నాణ్యత పై మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ దృష్టి





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 05)**

ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై తక్షణ స్పందనగా కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను షేక్ అబ్దుల్ గఫార్ గురువారం స్వయంగా పరిశీలించారు. సాయి నగర్, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న రహదారి, డ్రైనేజ్ తదితర పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు స్థానిక ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ, నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. పనులు పూర్తయిన తర్వాత మళ్లీ మరమ్మతులు అవసరం లేకుండా దృఢంగా నిర్మాణం చేయాలని పేర్కొన్నారు. పనుల పురోగతిపై అధికారులతో చర్చించి, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చైర్మన్ వెంట ఏఈలు మాధవ్, కోటేశ్వరరావు, మున్సిపల్ కార్యదర్శి షంషీర్ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరగా, సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

## రూ.6 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 200 సబ్ స్టేషన్ల నిర్మాణం

సబ్ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి గొట్టిపాటి సభకు వివరించారు. విజయనగరంలో కూడా విశాఖపట్నం తరహాలో అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కోరగా, ఆ వ్యవస్థ ఖర్చుతో కూడుకున్నదని మంత్రి గొట్టిపాటి తెలిపారు. నిధుల లభ్యత, అవసరాన్ని బట్టి ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కోరగా, విద్యుత్ శాఖ ఫీజిబిలిటీ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పెరిగిందని, దీంతో రోజువారీ విద్యుత్ వినియోగం 263 మిలియన్ యూనిట్ల నుంచి 280 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి పెంపుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. అలాగే రైతులకు పెద్దఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, వ్యాపార, పారిశ్రామిక, గృహ అవసరాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిందని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత లేకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## కేపీఐ, పీ 4 ల పై మరింత దృష్టి పెట్టాలి

‘ బంగారు కుటుంబా’ ల అవసరాలను గుర్తించి వాటికి అండగా నిలిచేలా ‘మార్గదర్శ’లను అనుసంధానం చేయాలన్నారు. మార్గదర్శలను గుర్తించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. స్థానిక వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ డి హిమవంశీ, సిపిఓ సుధాకర్‌రెడ్డి, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## ఎన్నికల ముందు అంగన్వాడి కార్యకర్తలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

### మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా చంద్రబాబు నాయుడు నెరవేర్చింది లేదు
### వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 05)**

వైయస్ఆర్ సీపీ కార్యాలయంలోని సంస్థాగత కమిటీల నిర్మాణంపై సుదీర్ఘంగా నియోజకవర్గంలో ఏ పంచాయతీలో పెండింగ్ ఉన్నాయో నాయకులతో గురువారం చర్చించడం జరిగింది. అలాగే కూటమి ప్రభుత్వం వచ్చాక ఏ పథకాలు అందిస్తున్నారో మహిళలలో సమావేశమయ్యి చర్చించడం జరిగింది. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అని మహిళలకు నెలకు శ్రీ శక్తి అనే పథకం ద్వారా 1500 వందలు ఇస్తామని మహిళలని నిండా ముంచి వేశారని అన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇస్తానని ఇవ్వకుండా అలాగే అంగన్వాడీ కార్యకర్తల గౌరవ వేతనాలను పెంచుతామని మోసం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడుకే చెల్లుతుందని మహిళలతో చర్చించడం జరిగింది. మనం చేయలేనిది చెప్పకూడదు మాట ఇస్తే తప్పకూడదు అనే నినాదంతో గత ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ముందుకు అడుగులు వేశారు. గతంలో 42 రోజులు ధర్నాలు చేసిన కూడా వాటికి కూడా గౌరవ వేతనం కల్పించి సాధ్యమైనంతవరకు చేయాల్సిన న్యాయం అంగన్వాడీ వర్కర్లకు గత ప్రభుత్వం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్ ను దృష్టిలో పెట్టుకుని అన్ని వర్గాల వారికి కూడా ఎంతవరకు న్యాయం చేయగలము అంతవరకు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు చేయడం జరిగింది. ఈ కూటమి ప్రభుత్వం లాగా అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయలేదని అన్నారు. అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చినదే కాకుండా ఇప్పుడు వాళ్లకి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ధర్నా చేస్తే వారిని పోలీసులతో నిర్బంధించి అనేక రకాలుగా ఇబ్బంది పెట్టడం జరుగుతుందని చెప్పడం జరిగింది. జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేయూత పథకం ద్వారా సంవత్సరానికి మహిళలకు 18500 నేరుగా వారి అకౌంట్లలోనే పడుతుండేవని గుర్తు చేశారు.



# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 05)

ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా (మహిళా విభాగం) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎపియన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా ఒంగోలు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు యన్‌జిఓ హోమ్ ఒంగోలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో సుమారు 400 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ముందుగా మహిళా ఉద్యోగినులు యన్‌జిఓ హోమ్‌లో మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొన్నారు. మొదటి రోజు పాటల పోటీలు, టెన్నీ కొయిట్, మ్యూజికల్ చైర్స్ తదితర ఈవెంట్లకు పోటీలు జరుగగా అన్ని డిపార్ట్మెంట్స్ ఉద్యోగినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. టెన్నికొయిట్ పోటీలను యస్‌డి షమ్మి, డి జయమ్మ, కె భూషమ్మ, తదితరులు నిర్వహించగా, మొత్తం 32 జట్లు పాల్గొనగా మొదటి రౌండ్ పోటీలు పూర్తి అవ్వగా రెండో రౌండ్ కు చేరిన జట్ల కు పోటీలు రెండవ రోజు నిర్వహించ బడునని తెలిపారు. పాటల పోటీలకు నిర్వాహకులుగా యస్ జ్యోతి, అర్ వందన, అర్ సునీల కుమారి, జి దీప్తి, తదితరులు నిర్వహించగా మొత్తం వివిధ డిపార్ట్మెంట్స్



నుండి సుమారు 20 మంది ఉద్యోగినులు పాటల పోటీల్లో పాల్గొన్నారు. పాటల పోటీల్లో 1వ స్థానం ఆర్. సునీల కుమారి, ఆడిట్ శాఖ, 2వ స్థానం ఎం. సుజాత, ఏఎన్‌ఎమ్, 3వ స్థానం డాక్టర్ శ్రావ్య, రిమ్స్, ప్రోత్సాహక బహుమతులు ఎస్ నారాయణమ్మ, ఏఎన్‌ఎమ్, ఎస్ దేవమ్మ, నీటి పారుదల శాఖ, కె శాంతి దేవి, రిమ్స్‌లు విజేతలుగా నిలిచారు. పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎపియన్‌జిఓ అసోసియేషన్ మాజీ జిల్లా కోశాధికారి, బొమ్మరిల్లు వ్యవస్థాపకులు పి రాజ్యలక్ష్మి వ్యవహరించారు. మ్యూజికల్ చైర్స్ పోటీలను యస్ నారాయణమ్మ, యం మల్లిక, యస్ వెంకట పుష్ప, జి సుగుణ, శోభారాణి, తదితరులు నిర్వహించగా కార్యక్రమ నిర్వాహకులుగా ఎపియన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె శరత్ బాబు, జిల్లా కార్యదర్శి అర్ సి హెచ్ కృష్ణారెడ్డి, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు జిల్లా కన్వీనర్ సి హెచ్ శిరీష, పి భారతి, యస్ జ్యోతి, యస్ నారాయణమ్మ, డి నాగరాజ కుమారి, జి శైలజా కుమారి, లక్ష్మీ రాజ్యం తదితరులు నిర్వహించగా ఎపియన్‌జిఓ అసోసియేషన్ ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజీష్, కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్, జిల్లా సహాధ్యక్షులు యం వేంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి కె శివ కుమార్, కార్యనిర్వహక కార్యదర్శి బి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు బి ఏడుకొండలు, అర్ దీపక్ కుమార్, బి విజయ్ కుమార్, డి మధుసూదనరెడ్డి, వీరయ్య, జిలానీ, అంకబాబు, లక్ష్మణ్, కమిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలు స్కూళ్లకు అందుచేత




(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, మార్చి 05)

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చిత్ర పటాలు అందించామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకులు బియస్ నారాయణరెడ్డి తెలిపారు. సిపాయిల తిరుగుబాటుకు 10 సంవత్సరాల మునుపు ఆంగ్లేయుల మీద వీరోచితంగా పోరాడిన వ్యక్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడారు. అలాంటి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫోటో ప్రతి పాఠశాలలో అందించి విద్యార్థులకు ఆయన చేసిన ధైర్య సాహసాలను, గొప్పతనాన్ని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆస్ఫూర్తి కోసమే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ద్వారా విద్యార్థులకు తొందరగా చేరుతుందని కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘసేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు వాసవి జాగృతి మిత్రమండలి క్లబ్ అధ్యక్షులు హరికృష్ణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన టిడిపి నాయకులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 05)

పొదిలి పట్టణంలోని శ్రీ గోపాలకృష్ణ దాల్ మిల్ నందు గురువారం కందుల కొనుగోలు కేంద్రాన్ని టిడిపి నాయకులు ప్రారంభించారు. స్థానిక శ్రీ గోపాలకృష్ణ దాల్ మిల్‌లో మార్క్‌ఫెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకటనారాయణ బాబు ఇతర టీడీపీ నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో పొదిలి మండలంలోని మాదాలవారిపాలెం సహకార సంఘం పరిధిలో రైతులకు కందులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలకు రూ.8,000లు చొప్పున రైతుల నుండి కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గురుపూడి భాస్కర్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని దళారి వ్యవస్థ నిర్మూలించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, పొదిలి మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, మాజీ శివాలయం ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, పొదిలి శివాలయం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, పోలేరమ్మ గుడి ఛైర్మన్ ముని శ్రీనివాసులు, ఏఎంసి డైరక్టర్లు రోళ్ళ శ్రీను, సోమిశెట్టి శ్రీదేవి, మాజీ వైస్ సర్పంచ్ షేక్ జిలాని, మాజీ వార్డు మెంబర్ జ్యోతి మల్లిఖార్జున, రాజు, సామి రాజా, తదితరులు పాల్గొన్నారు.











## పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలు శిక్ష, జరిమానా విధిస్తారు

### కౌమారదశలో లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 05)

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళల భద్రతపై జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ శాఖల సమన్వయంతో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని బొగ్గులు గొంది కాలనీ అంగన్వాడి కేంద్రం నందు కౌమార బాలికలకు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భధారణ పూర్వ, జనన పూర్వ రోగ నిర్ధారణ పద్ధతులు (పిసిపిఎన్‌డిటి) చట్టం పై అవగాహన కలిగించారు. లింగ వివక్షను తగ్గించడం, ఆడ పిల్లల సంఖ్యను పెంచడమని తెలిపారు. భారతదేశంలో స్త్రీ భ్రూణ హత్యలను అరికట్టడానికి, లింగ నిష్పత్తిని మెరుగుపరచడానికి రూపొందించబడిన చట్టమని తెలిపారు. ఇది గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను, ప్రకటనలను పూర్తిగా నిషేధిస్తుందని ఈ అవగాహన కలిగించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలు శిక్ష,జరిమానా విధిస్తారని తెలిపారు. అలాగే కౌమారదశలో లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు పార్వతి, సుమతి, ఏఎన్ఎం దొరసాని, పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, అంగన్వాడీ టీచర్ అంకమ్మ, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలి

### జడ్జి బి రూపశ్రీ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 05)

సమాజంలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, ఇది ఒక దురాచారమని కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి బి రూపశ్రీ స్పష్టం చేశారు.బాల్య వివాహ రహిత భారతదేశం కోసం బాల్య వివాహ నిర్మూలన కు 100రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు నిర్మూలనకు కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన హెల్ప్ లైన్ నంబర్‌ల ప్రచార గోడ పత్రికను కోర్టు ఆవరణలో జడ్జి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం పిల్లల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని, చట్టాన్ని ఉల్లంఘించి పెళ్లిళ్లు జరిపితే కఠిన శిక్షలు, జరిమానాలు తప్పవని వారు హెచ్చరించారు. బాల్య వివాహ నిరోధక చట్ట 2006, పోక్సో చట్టం 2012 ప్రకారం ఇవి నేరమని ఆమె పేర్కొన్నారు. బాల్య వివాహ నిర్మూలన కు 100రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ ముక్త్ భారత్ నినాదంతో నల్సా ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో లైన్ డిపార్ట్మెంట్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల్య వివాహల నిర్మూలనకు కనిగిరి కోర్టు పరిధిలోని గ్రామాలలో పాఠశాల, కాలేజిలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పారాలిగాల్ వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో భక్తులకు అందుబాటులో టిటిడి పంచాంగాలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 05)

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన శ్రీ పరాభవ నామ నూతన సంవత్సర తెలుగు పంచాంగాలను గురువారం నుండి భక్తులకు అందుబాటులో ఉంచినట్లు ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవి రామకృష్ణారావు, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి వెల్లడించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ టిటిడి పంచాంగాలు కావలసిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో దేవస్థానం పని వేళలలో సంప్రదించాలని కోరారు.

# ట్రంప్ నిరంకుశ వాది ట్రంప్ కుమ్ముకొస్తున్న మోదీ

**మోడీ విధానాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి**

**కేంద్ర రాష్ట్ర విధానాలు రాజకీయ లబ్ధి కోసమే**

**పేదల పక్షాన పోరాడేది సిపిఐ**

**మార్కాపురం, ప్రకాశం నూతన జిల్లా కార్యదర్శులుగా ఎం ఎల్ నారాయణ, ఆర్ వెంకట్రావు ఎంపిక**

**సిపిఐ జిల్లా సమితిలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య**







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 05)**

పంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న అమెరికా విధానాలపై ప్రజాస్వామిక వాదులంతా నిరసన తెలియజేయవలసిన తక్షణ అవసరం ఏర్పడిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సిపిఐ సమితి సమావేశం అందే నాసరయ్య అధ్యక్షతన గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను కిడ్నాప్ చేసే దుస్సాహసానికి అమెరికా పాల్పడటం శాంతియుత వాతావరణానికి విఘాతం కల్పించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తున్న అమెరికా తన విధానాలను మానుకోకపోవడం ట్రంపు నిరంకుశ విధానాన్ని తెలియజేస్తుందని అన్నారు. అమెరికా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో తమ సైన్య స్థావరాలను ఏర్పరచుకుంటున్నదని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు కలిగిస్తుందని ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అనేక చిన్న దేశాలపై యుద్ధాలు చేస్తూ ఆ దేశాలను కబలించటం అమెరికా బరితెగింపు విధానానికి నిదర్శనమని అన్నారు. ఆనాడు ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ అమెరికా విధానాలను నిర్ద్వందంగా తిరస్కరిస్తే ఈనాడు నరేంద్ర మోడీ ట్రంపు విధానాలకు తలూపుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి కావాలని యుద్ధం వద్దని కమ్యూనిస్టు పార్టీలు కోరుకుంటున్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చిన్న దేశాలపై అమెరికా చేసే యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా శాంతి యుత వాతావరణం పై ప్రభావితం చూపుతాయని ఆయన అన్నారు. భారతదేశంలో నరేంద్ర మోడీ విధానాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరంగా మారుతున్నాయని ఈశ్వరయ్య అన్నారు. భారతదేశం వెలిగిపోతుందన్న నరేంద్ర మోడీ వాస్తవాన్ని ప్రజలకు వివరించడానికి ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. బిజెపి వాళ్లకు మాత్రమే భారతదేశం వెలిగిపోతుందని, మిగిలిన ప్రజలందరికీ భారతదేశం అంధకారంగా మారుతున్నదని ఆయన ఎద్దేవా చేశారు. మతాల పేరుతో ప్రజలను విభజించి పాలించటమే బిజెపి సిద్ధాంతమని ఆయన అన్నారు. డబల్ ఇంజన్ ప్రభుత్వం మాది ఆంధ్ర ప్రదేశ్ ని నవ్యాంధ్రగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రోజుకో మాట చెప్తున్నదని ఆయన విమర్శించారు. 1996లో ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన రాయి వేసి 30 సంవత్సరాల వుతున్నదని, అయినా ఇంతవరకు ప్రాజెక్టు పూర్తి కాలేదని బాబు మాటలకు చేతలకు పొంతన ఉండదని అన్నారు. విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. తిరుమల తిరుపతి లడ్డు వ్యవహారం కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగినంత కాలం సాగదీస్తారేమోనని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తారనుకున్న సమయంలో తిరుమల తిరుపతి లడ్డు వ్యవహారం బయటకు వస్తున్నదని ఆయన అన్నారు. పలు కార్పొరేట్ కంపెనీలకు 99 పైసలకు ల్యాండ్ ఇవ్వటం సమంజసం కాదని ఆయన అన్నారు. లోకేష్ కుటుంబానికి చెందిన స్థలం ఇచ్చుకుంటే తమకేమి అభ్యంతరం లేదని ప్రజల ఆస్తులు ఇవ్వటానికి తాము వ్యతిరేకమని ఈశ్వరయ్య స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తే తీవ్రంగా ప్రతికటిస్తాం, ప్రజలకు అనుకూలంగా ఉంటే సహకరిస్తాం అని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందినందునే సిపిఐ ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర సిపిఐ మాత్రమే పోషిస్తున్నదని ఆయన గుర్తు చేశారు. గడపగడపకు సిపిఐ కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు. ప్రజా సమస్యలపై మార్చి 24న రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి జంగాల అజయ్ కుమార్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్రావు నెల్లూరు జిల్లా కార్యదర్శి అరిగెల సాయి,బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తదితరులు పాల్గొన్నారు.

## కొండపి నియోజకవర్గ పరిశీలకులుగా డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మార్చి 05)**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని ఆయా నియోజక వర్గాలలో పార్టీ నిర్మాణంపై దృష్టి సారించింది. అందులో భాగంగా పార్టీ రాష్ట్ర కమిటీలో ఉన్న కీలక నేతలను జిల్లాలోని పలు నియోజక వర్గాలకు పార్టీ పరిశీలకులుగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ రాష్ట్ర సెక్రెటరీ గా ఉన్న డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ కొండేపి నియోజక వర్గానికి పార్టీ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈయన పార్టీ ఆవిర్భావం నుండి అదే పార్టీలో కొనసాగుతూ చురుకైన పాత్ర పోషిస్తూన్నారు. ఈయన ప్రధానంగా మైనారిటీ వర్గంతో పాటు ఇతర సామాజిక వర్గాల్లో కూడా మంచి సౌమ్యులుగా పేరు తెచ్చుకున్నారు.అలాగే పార్టీకి వీర విధేయులుగా వుంటారని కూడా ఆ పార్టీ నాయకుల్లో అభిప్రాయం ఉండడం విశేషం. అలాగే ఈయన గత వైసిపి ప్రభుత్వ హయాంలో పార్టీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ గాను, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా కొద్ది రోజుల పాటు బాధ్యతలు నిర్వర్తించారు. దర్శి నియోజకవర్గానికి డాక్టర్ మదాసు వెంకయ్య, మార్కాపురం నియోజకవర్గానికి డాక్టర్ బత్తుల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గానికి పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గానికి పార్టీ రాష్ట్ర సెక్రెటరీ గా వున్న కెవి రమణారెడ్డి, ఒంగోలు నియోజకవర్గానికి వై వెంకటేశ్వరరావు, సంతనూతలపాడు నియోజకవర్గానికి బొట్ల రామారావు, కనిగిరి నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి అదెన్నలు నియమితులయ్యారు. నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన వీరందరూ ఆయా నియోజకవర్గాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలతోను, అలాగే జిల్లా పార్టీ అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ, మరో వైపు పార్టీ రాష్ట్ర కార్యాలయంతో అనుసంధానం చేసుకుంటూ ముందుకు సాగాలని పేర్కొన్నట్లు తెలిసింది. అలాగే కూటమి ప్రభుత్వం గత 20 మసాల వైఫల్యాల గురించి ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేసి వారిని చైతన్య పరచాలని నాయకులకు దిశ నిర్దేశం చేసింది.

## కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపి పురోగమనం రానున్న రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు

**పరుగులు తీయనున్న పారిశ్రామిక రంగం**



**(షణ్ముఖ వెలుగు, కంభం, మార్చి 5)**

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రం పురోగమనం వైపు దిశగా పరుగులు తీస్తుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం కంభం పట్టణంలో పార్టీ మండల అధ్యక్షులు బాదం కిషోర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ గత 5 సంవత్సరాల వైసిపి ప్రభుత్వ హయాంలో ఏపీ రాష్ట్రం విధ్వంసం బాటలో పయనించిందని,దీంతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో పాటు ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని నాటి జగన్ పాలనను తీవ్రంగా విమర్శించారు.

అయితే 2024 లో రాష్ట్రంలో ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన గాడిలో పడడమే గాక మరోవైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ఏపి రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు. మోడీ ప్రభుత్వం అభయం ఇవ్వడం ద్వారానే మన రాష్ట్రానికి రూ 20 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని ఆయన అన్నారు. తద్వారా రాష్ట్రంలో నూతన పరిశ్రమలు స్థాపనం జరగడంతో పాటు లక్షలాది మంది యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పలితంగా పెద్ద పెద్ద బహుళ జాతి సంస్థలు మన రాష్ట్రానికి తరలి రానున్నాయని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణల ఫలితంగా అంతర్జాతీయంగా భారత దేశం కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరిగాయని ఆయన అన్నారు. మార్కాపురం జిల్లా ప్రజల ఆకాంక్షల మేరకు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కానున్నాయని అన్నారు. 11 ఏళ్ల మోడీ పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి నారాయణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మినుము పంటను పరిశీలన

**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, మార్చి 05)**




మండలంలోని గణపవరం, ఎండూరివారిపాలెం గ్రామలల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి బి సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులందరు కూడా రైతు ఐడి (భూ ఆధార్) తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుకు రైతు ఐడి ముఖ్యము అని తెలియచేసారు.అదే విధంగా ఎండూరివారిపాలెం గ్రామంలోని మినుములు, పత్తి పంటలను సందర్శించి పంటలోని తెగుళ్లు, పురుగులు వాటి ప్రభావం పై ఎటువంటి చర్యలు, జాగర్తలు తీసుకోవాలో రైతులకు తెలియచేసారు. అదే విధముగా మినుములో పచ్చ దోమ, పెనుబంకా పురుగు ఉధృతి కనిపించంచటం జరిగింది. దాని నివారణకు గాను తాయోమిథక్సిన్ లేదా ఇమిడాక్లోప్రైడ్ ఎదో ఒకటి పిచికారీ చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామం పెద్దలు అదేవిధంగా గ్రామ వ్యవసాయం సహాయకులు వెంకట రామి రెడ్డి , చిన్న మస్తాన్ నాయక్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబానికి పోలీసుల ఆర్థిక చేయూత

**మరణించిన సహోద్యోగి కుటుంబానికి పోలీస్ సిబ్బంది అండగా నిలవడం అభినందనీయం**

**జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 05)**

కందుకూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న షేక్ సాజిద్ 2026 జనవరి 19న కందుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మరణించారు. తన కుటుంబానికి ఆర్థిక చేయూతగా 2009 బ్యాచ్‌కు చెందిన పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా సేకరించిన రూ.2,14,000ను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు చేతుల మీదుగా కానిస్టేబుల్ తండ్రి బాషా కి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా నిలుస్తుందని, ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమంకు అన్ని చర్యలు తీసుకొని వారికి అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. తమ సహోద్యోగి విధి నిర్వహణలో మరణించిన కుటుంబానికి పోలీసు సిబ్బంది ఆర్థిక సహాయం అందించి అండగా నిలవడం అభినందనీయమన్నారు.

## మండల ఎస్ఐగా శివరామయ్య

**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, మార్చి 05)**



త్రిపురాంతకం మండల ఎస్ఐగా శివరామయ్య గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో రాజీ లేదన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చట్ట ప్రకారం శిక్షించబడతారన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు.

# మాదిగ మాన్యం ఆక్రమించిన వారి పై ల్యాండ్ గ్రాబింగ్, ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి అరెస్టు చేయాలి

## సంతనూతలపాడు ఎమ్మార్వో ను సస్పెండ్ చేయాలి

## ఒంగోలు ఆర్డీఓకు దళిత నేత నీలం, బాధితులు ఫిర్యాదు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 05)**

మాదిగ మాన్యం ఆక్రమించిన దుంపా, రెడ్ల ముఠాను ల్యాండ్ గ్రాబింగ్, ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి అరెస్టు చేయాలని, వారికి సహకరించిన సంతనూతలపాడు ఎస్ఐ, ఎమ్మార్వోలను సస్పెండ్ చేయాలని కోరుతూ గురువారం ఒంగోలు ఆర్డీవో లక్ష్మి ప్రస్నకు దళిత నేత నీలం నాగేంద్రరావు, బాధితులు కలిసి ఫిర్యాదు చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ రాజబాబు ఆదేశాల మేరకు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్నను కలిసి మాదిగ మాన్యం పూర్తి వివరాలు రికార్డుతో అందించారన్నారు. అలాగే 2022వ సంవత్సరం 10వ నెల కలెక్టర్ ఆదేశాల మేరకు ఒంగోలు ఆర్డీవో ద్వారా సంతనూతలపాడు తాసిల్దార్‌కి మాదిగ మాన్యం భూమి హక్కు ఆక్రమణ పై పంపిన లేఖను ఇచ్చారన్నారు. అలాగే 25వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన మరలా ఒంగోలు ఆర్టీవో లక్ష్మి ప్రసన్న సంతనూతలపాడు తాసిల్దార్ కు పంపిన లేఖను కూడా ఆర్టీవోకి చూపించారన్నారు. అలాగే 2025వ సంవత్సరం ఫిబ్రవరి నెల 17వ తేదీన ప్రకాశం జిల్లా ఎస్పీకి మాదిగ మాన్యం హక్కుదారుడు బొమ్మల దేవ సహాయం ఫిర్యాదు చేసిన కాపీని కూడా చూపించారన్నారు. కానీ మొత్తం మాదిగ మాన్యం 19 ఎకరాల 15 సెంట్లు, రెండున్నర ఎకరా పోను మిగతాదంతా దుంపా కుటుంబ సభ్యులే తప్పుడు డాక్యుమెంట్లతో సంతనూతలపాడు ఎస్ఐ, తాసిల్దార్‌ల అండతో ఆక్రమించారన్నారు. ప్రస్తుతం బొమ్మల దేవ సహాయం, వంకాయలపాటి బాపమ్మ, అట్లూరి రామయ్య లకు ఒక్కొక్కరికి 78 ల సెంట్లు చొప్పున మొత్తం రెండు ఎకరాల 34 సెంట్లు భూమిని దుంప సంగ్రామరెడ్డి ముఠా జనవరి 21వ తేదీన పోలీసు రెవెన్యూ అండతో ఆక్రమించుకున్నారని అన్నారు. పై మొత్తం భూమికి అర్ధరాత్రి ఫ్రేడ్ లైట్లు వేసి రేకులతో కంచవేశారన్నారు. గత సంవత్సరం జూలై నెలలో పై భూమిలో మాదిగలు సాగు చేసుకుంటున్న పంటను ట్రాక్టర్లు జెసిపిలతో దుంప సంగ్రామరెడ్డి ముఠా దాడి చేసి పంటను నష్టపరిచి, మాదిగ హక్కు దారులపై అత్యాయత్నం చేసిన ప్రస్తుత ఎస్పై మాదిగ కులానికి చెందిన అజయ్ బాబు కేసు నమోదు చేయలేదని అన్నారు. కానీ దుంప సంగ్రామిరెడ్డి దగ్గర ఫిర్యాదు తీసుకొని మాదిగ భూమి హక్కుదారులపై 97/25గా, మాదిగ మాన్యం హక్కుదారులపై కేసు కట్టారన్నారు. ఈ సంవత్సరం గతంలో 9వ తేదీన కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో ఫిర్యాదు చేసినా ఎటువంటి విచారణ జరపలేదని అన్నారు. గత సంవత్సరం ఫిబ్రవరి 17వ తేదీన ఎస్పీ గ్రీవెన్స్‌లో బొమ్మల దేవ సహాయం ఫిర్యాదు చేసిన సంతనూతలపాడు ఎస్ఐ అజయ్ బాబు రెడ్ల ఆక్రములకు గొడుగు పడుతూ మాదిగల ఫిర్యాదు రిజిస్టర్ చేయలేదన్నారు. అంతట దుంప సంగ్రామిరెడ్డి ముఠా మాదిగల మన్యం చుట్టూ వేచిన రేకుల కంచెను ఫోటోలు ఆర్డీవోకి చూపించారన్నారు. సంతనూతలపాడు ఏఎస్ఐ వెంకట్రావు మరి కొంతమంది పోలీసులు మాదిగల మన్యం లోకి వెళ్లిన మాదిగ హక్కుదారులని బయటకు నెట్టి పోలీసులే రెడ్డి ల్యాండ్ గ్రాఫింగ్ ముఠాతో కలిసి రెడ్ల రేకుల కంచెకు తాళం వేశారన్నారు. కోర్టు ఉత్తర్వులు లేకుండా సంతనూతలపాడు తాసిల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి ఆదేశాలతోనే, సంతనూతలపాడు ఎస్ఐ అజయ్‌బాబు ఈ చట్ట వ్యతిరేక మాదిగల మన్యం ఆక్రమించిన రెడ్లముఠాకు సహకరిస్తున్నారు. కావున మాదిగ మాన్యాన్ని ఆక్రమించిన దుంపా సంగ్రామిరెడ్డి ముఠాపై ల్యాండ్ గ్రాబింగ్, ఎస్సీ, ఎస్టీ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని హైకోర్టు న్యాయవాది చక్రవర్తి, మాదిగ మాన్యం హక్కుదారులు, ఆర్డీవోను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో వున్నారు.

# విద్య భవన్ నిర్మాణానికి స్థలం పరిశీలించిన కలెక్టర్







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, మార్చి 05)**

విద్య భవన్ నిర్మాణం కోసం బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెం రైల్వే గేట్ వద్ద ఉన్న ఉర్దూ ఉప తనిఖీ అధికారి కార్యాలయం ప్రాంగణంలోని ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ గురువారం పరిశీలించారు. 49 సెంట్ల విస్తీర్ణంలో విద్య భవన్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యాశాఖకు సంబంధించిన అన్ని కార్యాలయ భవనాలను ఒకే చోట ఇక్కడే నిర్మించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. అనంతరం పక్కనే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌ను కూడా కలెక్టర్ పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో గ్లోరియా, డీఈవో శ్రీనివాస్ సింగ్, తహసీల్దార్ షేక్ సలీమా ఉన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు తన సొంత ఖర్చులతో మెటీరియల్స్ అందించిన యాగంటి మల్లికార్జునరావు



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 05)**

మాచర్ల పట్టణం శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులను కలిసి త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, పరీక్షలకు కావాల్సిన మెటీరియల్స్‌ను విద్యార్థులకు సొంత ఖర్చులతో తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిలిచినందుకు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ అయ్యపురెడ్డి హరిణికి ధన్యవాదాలు తెలిపారు. జీవితంలో ఎదగటానికి మొట్టమొదటి బీజం పడేది స్కూల్ నందు అని వెల్లడించారు. విద్యార్థులందరూ కూడా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. దేశం పట్ల గౌరవం, తల్లిదండ్రులు మీద ప్రేమ అనురాగాలతోటి ఉండాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు విద్యార్థులు అందరూ కూడా గ్రాడ్యుయేట్ అయ్యి కాలేజీ నుంచి బయటకు వచ్చేసరికి మన ఆంధ్ర రాష్ట్రంలో వందల కంపెనీలు వస్తాయని, మీరు ఉద్యోగ అవకాశాల కోసం ఏ రాష్ట్రానికి కానీ, వేరే దేశానికి కానీ వెళ్లకుండా మన రాజధాని అమరావతిలో ఆంధ్రప్రదేశ్‌లోనే భారీగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని విద్యార్థులకు వెల్లడించారు. ఇప్పుడు వస్తున్న సాంకేతికను విద్యార్థులు అందరూ కూడా అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చదువు చెప్పిన గురువులు పట్ల ఎప్పుడు అంకితభావంతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిక్కా కొండలు. బొట్టు కోటేశ్వరరావు. దుర్భాగులు ప్రసాద్‌రావు, బ్రహ్మయ్య, స్కూల్ డీన్ అనిల్ కుమార్, ఇంచార్జి శివ, స్కూల్ టీచర్స్ చెన్నకేశవులు, లక్ష్మీనారాయణ, ముక్కంటి, చంద్రశేఖర్, అరుణ, నసీమ, మనోజ్ కుమార్, స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఇంటూరి

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 05)**

మంగళగిరి జఖ కన్వెన్షన్‌లో గురువారం కూసి శ్రీనివాస్ కుమారుడు జస్వంత్ వివాహ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రముఖ నటులు శివాజీతో కలిసి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.





# అరగంటలోనే పోయిన మొబైల్ రికవరీ



**(షణ్ముఖ వెలుగు, దొరవారిసత్రం, మార్చి 05)**

సూళ్లూరుపేట నుంచి దొరవారిసత్రం కెజిబివి పాఠశాలకు వెళుతున్న టీచర్ వినీత గురువారం ఉదయం ఆటోలో ప్రయాణించే సమయంలో తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. వెంటనే సదరు టీచర్ వనిత ఎస్ఐ జివి చౌదరికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఎస్ఐ జీవీ చౌదరి స్పందించి ఫోన్ ట్రాకింగ్ చర్యలు చేపట్టారు. కేవలం అరగంటలోనే మొబైల్‌ను గుర్తించి వినీతకు అప్పగించారు. పోలీసుల వేగవంతమైన చర్యల పై ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

# సత్య పుట్టినరోజు సందర్భంగా అన్నదానం



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 05)**

ఏపి మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య) పుట్టినరోజు సందర్భంగా గురువారం కందుకూరులోని అన్నా క్యాంటీన్‌లో తానికొండ మహేంద్ర, చిడిపోతు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఒక్క రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి సత్యకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు.వారు మాట్లాడుతూ సత్య ఇలాంటి పుట్టినరోజు మరెన్నో జరుపుకోవాలని, మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా దేవుడు ఆయారారోగ్యాలు ప్రసాదించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నా క్యాంటీన్ పరిశీలకురాలు గుండవరపు లక్ష్మి, బెజవాడ ప్రసాద్, ఉన్నం కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

# మడకలవారిపల్లె గురుకుల పాఠశాలలో మెడికల్ క్యాంపు



**(షణ్ముఖ వెలుగు, గోపవరం, మార్చి 05)**

మండలంలోని మడకలవారిపల్లెలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో డాక్టర్ పి. శరత్ చంద్ర ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 57 మంది విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ వి. శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రతిరోజూ స్నానం చేసి శుభ్రమైన బట్టలు ధరించడం, ఆకుకూరలు, పాలు, గుడ్డు, పప్పు దినుసులు వంటి పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి శరత్ చంద్ర, హెల్త్ సూపర్వైజర్ వి శివరామిరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ పి మురళి, ఆశా కార్యకర్తలు ఎస్ నారాయణమ్మ, పి సుజాత, గురుకుల పాఠశాల స్టాఫ్ నర్స్ కళావతి, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతంగా నిర్వహించాలి

## ప్రతి నియోజకవర్గంలో 500 మందితో మహిళ దినోత్సవం వివిధ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలి

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, మార్చి 05)**

జిల్లా కేంద్రంలో ఈ నెల 8 నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు డిఆర్ఓ, ఆర్ డిఓలు, మున్సిపల్ కమిషనర్లు, డిఆర్డీఏ, మెప్మా, ఐసిడిఎస్ పి డి లు వివిధ జిల్లా శాఖల అధికారులతో ఈ నెల 8 న జిల్లా కేంద్రం తో పాటుగా నియోజకవర్గాలలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లు పై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 8 న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి 3 వేల మంది మహిళలు పాల్గొనున్నారని అందుకు అవసరమైన లొకేషన్ చూడాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. జిల్లా కేంద్రం తో పాటుగా నియోజకవర్గాలలో 5 వందల మంది మహిళలతో మహిళ దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించాలని నియోజకవర్గాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం లో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి మినిట్స్ మినిట్స్ తయ్యారు చేయాలని ఐసిడిఎస్ పి.డిని ఆదేశించారు. మెప్మా, డిఆర్డీఏ, ఐసిడిఎస్ పిడీలు, మూడు వేల మంది మహిళలను సమకూర్చలని ఆదేశించారు. స్త్రీ శక్తి మహిళ యాప్,మహిళ పోలీస్, డిఆర్డీఏ, మెప్మా, స్టాల్స్ ఏర్పాటు చేయాలని,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని డి యంహెచ్ఓను ఆదేశించారు. డిఆర్డీఏ మెప్మా ద్వారా మెగా చెక్కును పంపిణీ చేయాలని పీడీలను ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రోగ్రాంలో ముఖ్యమంత్రి పాల్గొనున్న కార్యక్రమం లైవ్ ఉంటుందని తెలిపారు. జిల్లా నుండి డ్వాక్రా సంఘాల సభ్యులు 6 వందల మంది మహిళలను ముఖ్యమంత్రి పాల్గొనే సమావేశానికి పంపించుటకు 12 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ను, డీఆర్డీఏ మెప్మా పీడీలను ఆదేశించారు. జిల్లాలోని యంపి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, జిల్లా నుండి కొంత మహిళలతో ముఖ్యమంత్రి మాట్లాడతారని వారిని సిద్ధం చేయాలని ఐసిడిఎస్, డిఆర్డీఏ పీడీలను ఆదేశించారు. జిల్లాలోని చినగంజాం మండల పరిధిలో సముద్రం మొక్కల పెంపకం యూనిట్‌కు చెందిన మహిళ ముఖ్యమంత్రి సమావేశానికి వెళ్లడం జరుగుతుందని తెలిపారు. యంఎస్‌యంఈలకు సంబంధించిన పారిశ్రామికవేత్తలను, లబ్ధిదారులను తీసుకురావాలని జియండిసి, బ్యాంక్ అధికారులని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ లో టాప్ 3 ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్యాంకుల వద్ద పెండింగ్ ఉన్నవాటిని బ్యాంక్ అధికారులతో మాట్లాడి పూర్తి చేయాలని ఏపియం లను ఆదేశించారు. స్త్రీ నిధి,ఉన్నతి కి సంబంధించి రుణాలు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని బ్యాంక్ అధికారుల ఆదేశాలు ఇవ్వాలని యల్‌డియం ను ఆదేశించారు. మహిళ సంఘాలకు రుణాలు ఇప్పించడంలో చివరలో ఉన్న ఏపియం లకు సంబంధించి వ ఫైల్ పంపించాలని డిఆర్డీఏ, మెప్మా పీడీలను ఆదేశించారు. ప్రతి మండలం నుండి విజయగాథలు పంపించాలని డిఆర్డీఏ పి డి ఆదేశించారు. వివిధ శాఖల కు సంబంధించిన అధికారులు బ్యాంక్ ఖాతాలను తప్పని వంద శాతం ఈకెవైసి చేయించాలని జిల్లా ట్రెజరీ అధికారిణి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి డిఆర్ ఓ జి గంగధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఐసిడిఎస్, డిఆర్డీఏ, మెప్మా పిడీలు రాధమాదవి, సింగయ్య, ఆనంద పాల్, డియం హెచ్ఓ ఎస్ విజయమ్మ, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల, ఏపిఎస్ఆర్టీసీ ఆర్‌యం విమల, జిల్లా రవాణా అధికారి పరందామరెడ్డి, పౌర సరఫరా శాఖ డి యం శ్రీలక్ష్మి, డిసిహెచ్ఎస్ పద్మావతి, జిల్లా కలెక్టరేట్ ఏఓ మల్లిఖార్జునరావు, డిఎస్పీలు, తదితరులు పాల్గొన్నారు.






# అసెంబ్లీని సందర్శించిన కొడవలివారిపాలెం విద్యార్థులు ఎమ్మెల్యే ఏలూరితో ముచ్చట్లు



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మార్చి 05)**

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని కొడవలివారిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు గురువారం ఆంధ్రప్రదేశ్ శాసనసభను సందర్శించారు. శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు సభ నిర్వహణ, చట్టసభ కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, హోంమంత్రి వంగలపూడి అనిత, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారు విద్యార్థులతో మాట్లాడి శాసనసభ ప్రాధాన్యత, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధుల పాత్ర గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రాజకీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. శాసనసభ వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రత్యక్షంగా చూసే అవకాశం విద్యార్థులకు మంచి అనుభవాన్ని అందిస్తుందని తెలిపారు. చట్టసభలు ఎలా పనిచేస్తాయి, ప్రజా సమస్యలపై ఎలా చర్చలు జరుగుతాయి అన్న విషయాలు తెలుసుకోవడం ద్వారా విద్యార్థులకు విస్తృతమైన అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. శాసనసభ సందర్శనపై విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి ఫోటోలు దిగారు.

# కర్లపాలెం భూ నిర్వాసితులకు సకల సౌకర్యాలతో ఆర్ అండ్ ఆర్ కాలనీ

**పట్టాలు ఇచ్చి మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుకి ధన్యవాదాలు**

**టిడిపి మాజీ జిల్లా సాంస్కృతిక కార్యనిర్వాహక కార్యదర్శి మర్రి బోయిన వెంకయ్య**



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 05)**

కర్లపాలెం భూ నిర్వాసితులకు సకల సౌకర్యాలతో ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పట్టాలు ఇచ్చిమాట నిలబెట్టుకున్నారని టీడీపీ మాజీ జిల్లా సాంస్కృతిక కార్యనిర్వాహక కార్యదర్శి మర్రిబోయిన వెంకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీ కర్లపాలెం గ్రామానికి గత ప్రభుత్వం రామాయపట్నం పోర్టు మారిటైమ్ బోర్డు ద్వారా బలవంతంగా భూమి విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేశారు. అసంతృప్తితో రైతులు రెండు మూడుసార్లు సమ్మె చేయడం కూడా జరిగింది. అప్పటి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పుతు రైతులకు న్యాయం చేయలేకపోయింది. 2024 సంవత్సరంలో ఇంటూరి నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో రామాయపట్నం, సాలిపేట, కర్లపాలెం రైతులకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మీకు ఎలాంటి అన్యాయం జరగకుండా న్యాయం జరిగేలా తాను చూసుకుంటాను అని మాటిచ్చారు. ఆ మాట ప్రకారం మన ప్రభుత్వం వచ్చిన 20 నెలలోనే మన నారా చంద్రబాబు నాయుడు సహకారంతో రైతులకు అన్ని వసతులతో కూడిన 371 మందికి ఆర్ అండ్ ఆర్ కాలనీ పట్టాలు ఇచ్చి, ఈ సంవత్సరం ఆఖరికి ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తానని హామి ఇవ్వడం కూడ జరిగిందన్నారు. అక్కడ రైతుల మొహంలో ఆనందాన్ని నింపి, మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ఉలవపాడు మండల ప్రజలు, రైతుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

# వరల్డ్ ఒబేసిటీ డే 2వ రోజు అవగాహన కార్యక్రమాలు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 05)**

వరల్డ్ ఒబేసిటీ డే సందర్భంగా గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ఒంగోలు లోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం పీజీ విద్యార్థులు 2వ రోజు కమ్యూనిటీ అవుట్‌రిచ్ కార్యక్రమాలను నిర్వహించి, ఒబేసిటీ (అధిక బరువు), దాని నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొదటి కార్యక్రమం ఒంగోలు బస్ స్టాండ్ వద్ద నిర్వహించబడింది. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం పీజీ విద్యార్థులు ఉత్సాహభరితమైన ఫ్లాష్ మాబ్ ప్రదర్శన ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఊబకాయం పై అవగాహన కల్పించే పాటకు సంబంధించిన లిరిక్స్‌ను కూడా పీజీ విద్యార్థులే రచించి, ఆరోగ్యకరమైన జీవన విధానం మరియు ఒబేసిటీ నివారణపై సందేశాలను అందించేలా ప్రదర్శించారు. ఫ్లాష్ మాబ్ అనంతరం, ఒబేసిటీకి కారణాలు, దాని వల్ల కలిగే సమస్యలను వివరిస్తూ విద్యార్థులు ఒక రోల్ ప్లే ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది ప్రజలకు స్వచ్ఛందంగా ఎత్తు, బరువు కొలతలు చేయించుకున్నారు. వారి బిఎంఐ ను అంచనా వేశారు. కార్యక్రమంలో పాల్గొన్నావారికి వ్యక్తిగతంగా కౌన్సెలింగ్ అందించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, ఒబేసిటీని నివారించుకోవడం గురించి ప్రత్యేక సూచనలు ఇచ్చారు. తరువాత పీజీ విద్యార్థులు రాంనగర్ లోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలు, సిబ్బందితో సంభాషించారు. పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం, ఒబేసిటీ వల్ల కలిగే దీర్ఘకాలిక సమస్యలపై అవగాహన కల్పించేలా ఒక ఇంటరాక్టివ్ హెల్త్ ఎడ్యుకేషన్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మరింత ఆసక్తికరంగా, గుర్తుండిపోయేలా చేయడానికి పిల్లలను “ఒబేసిటీ అవగాహన డ్యాన్స్” లో పాల్గొనమని ప్రోత్సహించారు. పీజీ విద్యార్థులు ఒబేసిటీ అవగాహన థీమ్‌పై సులభమైన డ్యాన్స్ స్టెప్స్ నేర్పారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో శారీరక చురుకుదనం, ఆరోగ్యకరమైన అలవాట్లను సరదాగా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమాలు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ అండ్ హెడ్ డాక్టర్ బి శ్రీదేవి మార్గదర్శకత్వంలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గద్దల అశ్విన్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో పిజీ చదువుచున్న డాక్టర్ సోనీ ప్రియాంక, డాక్టర్ హెప్సీబా, డాక్టర్ కృపా సుమతి, డాక్టర్ సాయి ప్రత్యూష, డాక్టర్ రేష్మ, డాక్టర్ ఆర్విక్ కర్స్, డాక్టర్ ఖాజా మొహిద్దిన్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ జయరాం, డిపో సిబ్బంది, ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# సత్యకు శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 05)**

రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు గురువారం ఒంగోలు క్యాంప్ కార్యాలయంలో మండల టిడిపి నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్య ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, ఏఎంసి చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, మండల నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, గుమ్మల్ల వెంకట్రావు, అనుమోలు రాజా రమేష్, పల్లపోతు రమేష్ బాబు, అనుమోలు సుధాకర్, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, మండల టిడిపి ఉప అధ్యక్షుడు తానికొండ మహేంద్ర,, ముప్పాళ్ళ పిఎసిఎస్ చైర్పర్సన్ మన్యం రమణయ్య, రమణారెడ్డి రాఘవరెడ్డి, ఉన్నం శ్రీనివాసరావు, పల్లపోతు వెంకట్రావు, లేలపల్లి కోటి లింగయ్య, సర్పంచ్ షేక్ చిన్న మస్తాన్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com